


సిద్దిపేటలో అంబేద్కర్ సర్కిల్‌లో ధర్నా చేస్తున్న ఆటో కార్మికులు



సిద్దిపేటలో ఆటోలతో ర్యాలీ

# పోరుబాట



నర్సాపూర్‌లో ర్యాలీ తీస్తూ నిరసన వ్యక్తం చేస్తున్న ఆటో డ్రైవర్లు

- రోడ్డెక్కిన ఆటో కార్మికులు
- సిద్దిపేట పట్టణంలో భారీ ర్యాలీ
- తమ పొట్టకొట్టొద్దంటూ ఆటోకార్మికుల నిరసన
- అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించిన కార్మికులు

సిద్దిపేట, డిసెంబర్ 16 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి రాగానే ఆటో కార్మికుల పొట్ట కొట్టింది. రూపాయి రూపాయి జమ చేసి ఈఎంఐలు చెల్లిస్తున్నారు. రోజూ ఆటో నడిస్తే కానీ పూట గడవని కార్మికులు.. ఒక వైపు ఆటో ఈఎంఐలు.. మరో వైపు కుటుంబ పోషణ భారంగా మారింది. తమ బతుకులు రోడ్డు పాలయ్యాయంటూ సిద్దిపేట జిల్లా కేంద్రంలో ఆటో కార్మికులు భారీ ర్యాలీ నిర్వహించారు. సిద్దిపేట ముస్తాబాద్ చౌరస్తా నుంచి పాత బస్టాండ్ వరకు వందలాదిగా ఆటోలతో కార్మికులు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం సిద్దిపేట మోడ్రన్ బస్టాండ్ వద్ద అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సిద్దిపేట ఆటో క్రెడిట్ కో-ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు పాల సాయిరామ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ మూడు చక్రాల ఆటో కార్మికుల జీవితాల్లో చీకటి నింపిందన్నారు. కాంగ్రెస్ ప్రభు త్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యంతో ఆటో కార్మికులు ఉపాధి కోల్పోతున్నారన్నారు. సుమారు 50 లక్షల ఆటో కార్మికుల జీవితాలు రోడ్డున పడ్డాయన్నారు. రెక్కాడితే కానీ డొక్కాడని ఆటో కార్మికుల జీవితాలపై కాంగ్రెస్ ప్రభుత్వం పునరాలోచన చేయాలని డిమాండ్ చేశారు. ఆటో కార్మికులకు ప్రభుత్వం జీవనభృతి నెలకు రూ.15 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆటో లేని సమాజాన్ని ఊహించలేమని, ఆటో కార్మికుల సామాజిక, ఆర్థిక భద్రతను పరిగణించాలన్నారు. ఆటో నడిస్తేనే వారి జీవన చక్రం నడుస్తుందని, ప్రభుత్వం వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

## నిజాంపేటలో నిరసన

నిజాంపేట, డిసెంబర్16 : ప్రభుత్వం తీసుకొచ్చిన మహాలక్ష్మి పథకం ఎంతో మంది ఆటో డ్రైవర్ల నోట్లో మట్టి కొడుతుందని నిజాంపేట సీతారామాంజనేయ ఆటో డ్రైవర్స్ యూనియన్ సభ్యులు అన్నారు. శనివారం నిజాంపేట ప్రధాన రహదారిపై కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆటో డ్రైవర్లు జాల పోచయ్య, అబ్దుల్‌పాషా, అర్జున్, అబ్దుల్, బాబు, నాగరాజు పాల్గొన్నారు.

## ఉపాధి కోల్పోతున్న ఆటో డ్రైవర్లు

నర్సాపూర్, డిసెంబర్ 16 : రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం ప్రకటించడంతో ఆటోడ్రైవర్లు ఉపాధి కోల్పోయారని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కడారి నాగరాజు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం పట్టణంలోని చౌరస్తా వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లు రాస్తారోకో నిర్వహించి, ర్యాలీగా బయలుదేరి ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆటో డ్రైవర్లు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఆటో డ్రైవర్లు శ్రీనివాస్, నాగభూషణం, కుమార్, మోసిన్, అలీ, సత్యనారాయణ, రామకృష్ణ పాల్గొన్నారు.

## నిరసన తెలిపిన ఆటోడ్రైవర్లు

గుమ్మడిదల, డిసెంబర్ 16 : మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడంతో మా బతుకుదెరువు కోల్పోయామంటూ మండల ఆటో డ్రైవర్ల సంఘం సభ్యులు నిరసన తెలిపారు. శనివారం మండలంలోని కానుకుంటలో ఆటోడ్రైవర్ల యూనియన్ సంఘం అధ్యక్షుడు గుండగళ్ల వెంకటేశ్, డ్రైవర్లు సంయుక్తంగా నిరసన తెలియజేశారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ డ్రైవర్ల సంఘం సభ్యులు నీరుడిమల్లేశ్, రాజు, మురళి, లక్ష్మణ్, పోచయ్య, నాగరాజు పాల్గొన్నారు.



నిజాంపేటలో నిరసన వ్యక్తం చేస్తున్న సీతారామాంజనేయ ఆటో డ్రైవర్స్ యూనియన్ సభ్యులు



గుమ్మడిదల: కానుకుంట చౌరస్తాలో ఆందోళన చేస్తున్న ఆటో డ్రైవర్లు

### ఫార్మాసిటీ రద్దుతో గందరగోళంలో

# బీ ఫార్మసీ విద్యార్థులు

- రైతుల ఖాతాల్లో రైతుబంధు డబ్బులు జమచేయాలి
- ఆటోడ్రైవర్లను ఆదుకోవాలి
- ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్ అర్బన్, డిసెంబర్16 : ఫార్మాసిటీ రద్దుతో బీఫార్మసీ విద్యార్థులు గందరగోళంలో పడ్డారని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన గజ్వేల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్సీ రాజమౌళి, మాజీ ఏఎంసీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్‌తో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేసీఆర్ ప్రభుత్వం దేశంలోనే అంతర్జాతీయస్థాయి ప్రమాణాలతో అతిపెద్ద ఫార్మాసిటీని రంగారెడ్డి జిల్లా పరిధిలో ఏర్పాటు చేయాలని నిర్ణయించి, భూసేకరణ చేయడంతోపాటు నిర్మాణ పనులు చేపట్టారన్నారు. ఈ క్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి ఫార్మాసిటీని రద్దు చేయాలన్న నిర్ణయంతో పనులు నిలిచిపోయాయన్నారు. ఫార్మాసిటీ రద్దు నిర్ణయంతో బీఫార్మసీ చదువుతున్న విద్యార్థులు గందరగోళంలో పడ్డారన్నారు. ఫార్మాసిటీలో 350 కంపెనీలను ఏర్పాటు చేయడానికి ఆయా సంస్థలు ముందుకు వచ్చినట్లు తెలిపారు. ఫార్మాసిటీని రద్దు చేయడంతో 15లక్షల మందికి ఉద్యోగావకాశాలు కోల్పోయే దుస్థితి ఏర్పడిందన్నారు. రెండు రోజుల క్రితమే తెలంగాణలో ఏర్పాటు చేయాల్సిన రూ.100కోట్ల విలువైన ఐటీ కంపెనీ పక్క రాష్ట్రాలకు తరలిపోవడం అందరికీ తెలిసిందేనన్నారు. ఇప్పటికైనా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఐటీ ఫార్మా కంపెనీలను కాపాడుకొని ఇతర రాష్ట్రాలకు తరలిపోకుండా ప్రణాళికలు రూపొందించుకోవాలని విజ్ఞప్తి చేశారు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణంతో ఆటో డ్రైవర్ల కుటుంబాలు రోడ్డునపడే పరిస్థితి ఏర్పడిందన్నారు. రైతుబంధు డబ్బులు రైతుల ఖాతాల్లో జమచేయాలని కోరారు. వరికి మద్దతు ధర కల్పిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన రూ.500బోనస్‌ను ఇస్తూ ప్రతి గింజనూ కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీల సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దేవీరవీందర్, ఆత్మకమిటీ మాజీ చైర్మన్ ఊడెం కృష్ణారెడ్డి, పట్టణ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు నవాజ్‌మీరా, కొండపాక ఎంపీపీ ర్యాగళ్ల సుగుణ దుర్గయ్య, జడ్పీటీసీలు, బాలుయాదవ్, మంగమ్మారాంచంద్రం, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు చంద్రమోహన్‌రెడ్డి, మండల పార్టీల అధ్యక్షులు కరుణాకర్‌రెడ్డి, కుమార్ యాదవ్, కౌన్సిలర్లు లక్ష్మీకిషన్‌రెడ్డి, శిరీషారాజు పాల్గొన్నారు.

## 22న జిల్లాస్థాయి యువజనోత్సవాలు

మెదక్ మున్సిపాలిటీ, డిసెంబర్ 16 : జిల్లాస్థాయి యువజనోత్సవాలు-2024 ఈ నెల 22న జిల్లా కేంద్రంలోని వైస్రాయ్ గార్డెన్‌లో నిర్వహిస్తున్నట్లు జిల్లా యువజన, క్రీడల అధికారి నాగరాజు శనివారం ప్రకటనలో తెలిపారు. సొంత ఆర్కెస్ట్రాతో వచ్చేవారికి ప్రాధాన్యత ఇస్తామన్నారు. సాంస్కృతిక పోటీల్లో జానపద నృత్యం (10 మంది), జానపద పాట (ఐదుగురు), లైఫ్ స్కిల్స్ కాంపోనెంట్ పోటీల్లో కథారచన, ప్రకటన, పోస్టర్ మేకింగ్, ఫొటోగ్రఫీ పోటీల్లో మహిళలు, పురుషులకు పోటీలు నిర్వహిస్తామన్నారు. పోటీల్లో ప్రథమస్థానం పొందిన జట్టును రాష్ట్రస్థాయి పోటీలకు పంపించనున్నారు. పోటీల్లో 15 నుంచి 29 ఏండ్ల వయస్సు ఉండి, మెదక్ జిల్లా నివాసి అర్హులన్నారు. ఆసక్తి ఉన్నవారు దరఖాస్తులను ఈ నెల 20న జిల్లా యువజన, క్రీడల అధికారి కార్యాలయంలో సమర్పించన్నారు. సమాచారం కోసం 9347344440, 9494825665, 9493594388 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

# నత్తనడకన ధాన్యం కొనుగోళ్లు



- సంగారెడ్డి జిల్లాలో లక్ష్యం 2.93 లక్షల మెట్రిక్ టన్నులు
- ఇప్పటి వరకు 1.68 లక్షల మెట్రిక్ టన్నుల సేకరణ
- రైతులు ఇంకా పూర్తిగా అందని డబ్బులు

సంగారెడ్డి, డిసెంబర్ 16 (నమస్తే తెలంగాణ) : యాసంగి సీజన్ ప్రారంభమైనా సంగారెడ్డి జిల్లాలో వానకాలం ధాన్యం సేకరణ ఇంకా పూర్తి కాలేదు. జిల్లాలో 1,14,222 మంది రైతులు 1,51,359 ఎకరాల్లో వరి పంటను సాగు చేశారు. వ్యవసాయశాఖ వానకాలం సీజన్‌లో 3,67,440 మెట్రిక్ టన్నుల వరి దిగుబడి వస్తున్నదని అంచనా వేసింది. మార్కెట్‌లోకి 2,93,950 మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తున్నదని వ్యవసాయ శాఖ, పౌరసరఫరాలశాఖ అంచనా వేయగా, 2.93 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని జిల్లా యంత్రాంగం లక్ష్యంగా పెట్టుకున్నది.



కంది మండలంలో కొనుగోలు కేంద్రంలో ధాన్యం తేమ శాతాన్ని పరిశీలిస్తున్న సిబ్బంది

### 198 కొనుగోలు కేంద్రాల్లో 1.68 లక్షల టన్నుల ధాన్యం సేకరణ

సంగారెడ్డి జిల్లాలో 198 కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం సేకరించాలని అధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఐకేపీ ద్వారా 85 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారు. పీఏసీఎస్‌ల ద్వారా 80, డీసీఎంఎస్ ద్వారా 33 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. 198 కొనుగోలు కేంద్రాల ద్వారా 2,93,950 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. 2,93,950 టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యంగా అధికారులు కొనుగోళ్లు ప్రారంభించారు. ఇప్పటి వరకు 1,68,783 టన్నుల ధాన్యం సేకరించారు. ఐకేపీ కొనుగోలు కేంద్రాల ద్వారా 65,921 టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. డీసీఎంఎస్, పీఏసీఎస్ కొనుగోలు కేంద్రాల ద్వారా 1,02,86 టన్నుల ధాన్యం సేకరించారు. 2.93 లక్షల టన్నుల ధాన్యం సేకరించాలని లక్ష్యం పెట్టుకోగా, ఇప్పటివరకు 1.68 లక్షల టన్నుల ధాన్యం సేకరించారు. ఇంకా 1.25 టన్నుల ధాన్యం సేకరించాల్సి ఉంది. జిల్లాలో ధాన్యం సేకరణ దాదాపుగా పూర్తికావచ్చిందని చెబుతున్నారు. రైతుల నుంచి రూ.371కోట్ల విలువ చేసే ధాన్యం సేకరించగా, ఇప్పటి వరకు రైతులకు రూ.330.39 కోట్లు చెల్లించారు. రూ.41.44కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేయాల్సి ఉంది.